# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 70
పేజీలు : 08 | వెల: రూ.5/-
శనివారం
నవంబర్ 30, 2024
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## జవాన్ కు అంతిమ వీడ్కోలు



8లో..

# ఏడాదవుతున్నా.. కాలయాపనే



## మంత్రివర్గ విస్తరణకు ఇంకెన్నాళ్లు


రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7తో ఏడాది పూర్తవుతోంది. అయినా పూర్తి స్థాయి మంత్రివర్గ విస్తరణ జరుగనేలేదు. ఇప్పుడు..అప్పుడూ అంటూ ప్రకటనలు ఇస్తున్నారు తప్ప మంత్రి వర్గాన్ని మాత్రం విస్తరించడంలేదు. శాసనసభలోని 119 సభ్యుల లెక్క ప్రకారం 18 మందితో కేబినెట్ ఉండాలి. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిపి 12 మంది మంత్రులు మాత్రమే ఉన్నారు. మరో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయడంలో కొనసాగుతున్న తాత్సారం ఆశావహులతోపాటు కాంగ్రెస్ నేతల్లో ఒకింత అసహనం, ఆందోళనకు గురి చేస్తోంది. అయితే మంత్రి వర్గాన్ని విస్తరించాలంటే సీఎం రేవంత్‌రెడ్డికి కత్తిమీద సాములా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆశావహులు అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో ఒకరికి ఇస్తే మరికొందరిలో అసమ్మతి పెరుగుతుందనే ఆందోళన నెలకొంది. ఇది త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పడే ప్రమాదముందని కాంగ్రెస్ పెద్దలు బావిస్తున్నట్లు సమాచారం. దీంతో మంత్రి వర్గ విస్తరణపై కావాలనే సాగతీత ధోరణి ప్రదర్శిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే నిజమైతే మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న వారు మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

- వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి

- ఇంకా ఆరు పదవులు ఖాళీగానే..
- విస్తరిస్తే ఏమవుతుందోనన్న ఆందోళనలో సీఎం
- నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ తాత్సారం
- ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి
- పదేళ్లు కష్టపడిన వారికి గుర్తింపేదంటూ నిలదీత







వివరాలు2లో..

## డ్రై ఫ్రూట్స్ సిద్దేశ్వరుడు



కార్తీక మాసం చివరి శనివారం చతుర్దశి తిథి సంధర్బంగా హనుమకొండలోని సిద్దేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని డ్రై ఫ్రూట్స్ తో ప్రత్యేక అలంకరణ చేశారు. కార్తీక మాసం ముగుస్తున్నందున భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డ్రై ఫ్రూట్స్ సిద్దేశ్వరుడిని చూసేందుకు క్యూ కట్టారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ



2లో..

## కుల గణన మహా యజ్ఞం

- విజయవంతమయ్యేలా సహకరించాలి
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో వివరాలు నమోదు





8లో..

## రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక
- ఘనంగా ప్రారంభమైన ఐఏఎల్ రాష్ట్ర మహాసభలు

# ఏడాదవుతున్నా.. కాలయాపనే

- మంత్రివర్గ విస్తరణకు ఇంకెన్నాళ్లు
- ఇంకా ఆరు పోస్టులు ఖాళీగానే..
- విస్తరిస్తే ఏమవుతుందోనన్న ఆందోళనతో ఆలస్యం
- నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ తాత్సారం
- ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తి
- పదేళ్లు కష్టపడిన వారికి గుర్తింపేదంటూ నిలదీత



**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టి సంవత్సరం కావస్తోంది. అయినా మంత్రి వర్గ విస్తరణ మాత్రం అందని ద్రాక్ష లాగానే మిగిలిపోయింది. ఎంతో మంది ఎమ్మెల్యేలు మంత్రి పదవిపై ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీ–పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పలుమార్లు అధిష్టానంతో చర్చలు జరిపారు. తాజాగా ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ అధినేత్రి సోనియాగాంధీతో ముఖాముఖి మాట్లాడారు. అయినా నేటికీ మంత్రి పదవుల పందేరం కొలిక్కిరాలేదు.

**ఎదురుచూపులు..**

వరంగల్ ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే సీతక్క, కొండా సురేఖకు మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఉంది. గతంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంత్రి పదవి ఆశిస్తున్నా ఆయన కలలు నెరవేరే అవకాశం లేదని తెలుస్తోంది. కాంగ్రెస్ టికెట్‌పై గెలిచిన వారికి మాత్రమే మంత్రివర్గంలో చోటుంటుందని, ఇతర పార్టీల నుంచి వచ్చిన ఎమ్మెల్యేలకు అవకాశం ఉండదని ఇటీవల పీసీసీ నాయకత్వం ప్రకటించడంతో కడియం ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. మరోవైపు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కొంతకాలంగా అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనకు రెండుసార్లు వచ్చినా మాధవరెడ్డి కలువకపోవడం చర్చనీయాంశమైంది. సీనియర్ శాసనసభ్యుడినైన తనను సీఎం, అధిష్టానం గుర్తించడం లేదంటూ గుర్రుగా ఉన్నారు. మరోవైపు పరకాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సైతం మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం.

**రాజేందర్‌రెడ్డికి నామినేటెడ్ పదవి..**

వరంగల్ పశ్చిమ నుంచి తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించిన నాయిని రాజేందర్‌రెడ్డికి ప్రభుత్వ విప్ లేదా ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి లభిస్తుందని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరికి మంత్రి పదవులున్నందున ఇంకొకరికి అవకాశం దక్కకపోవచ్చని మరికొందరి వాదన. హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి మంత్రి వర్గంలో చోటు లేకపోవడంతో ఈసారి ఆయా జిల్లాలకు కేబినెట్‌లో చోటు దక్కుతుందని తెలుస్తోంది.

**నామినేటెడ్ పోస్టుల్లోనూ..**

నామినేటెడ్ పోస్టుల భర్తీలోనూ సీఎం రేవంత్‌రెడ్డి, అధిష్టానం తాత్సారం చేస్తున్నదని కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. ఇది సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. పార్టీ అధికారంలోకి రావడానికి పదేళ్లు కష్టపడ్డ వారికి గుర్తింపు ఇవ్వకపోవడం సమంజసం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకు కుడా చైర్మన్, గ్రంథాలయ సంస్థల చైర్మన్లు, కొన్ని మార్కెట్ కమిటీలు, దేవాలయ పాలకవర్గాలను మాత్రమే నియమించారు. మరికొన్ని మార్కెట్ కమిటీలు, దేవాలయాలకు నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. దేశంలోనే పెద్దదైన ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ , పాలకవర్గాన్ని ఇంకా ప్రకటించకపోవడంపై వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నేతలతోపాటు ఇక్కడి శాసనసభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల పదవుల భర్తీలో వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నేతలకు అవకాశం ఇవ్వాలని అధిష్టానానికి సూచిస్తున్నారు. లేకుంటే ఇన్నాళ్లు పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన నేతలకు గుర్తింపు లేనట్లేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## కుల గణన మహా యజ్ఞం

- విజయవంతమయ్యేలా సహకరించాలి
- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో వివరాలు నమోదు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన కుల గణన ఒక మహా యజ్ఞమని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఇది విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో శనివారం మంత్రి సురేఖ వివరాలు నమోదు చేయించుకున్నారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటి కమిషనర్ రజనీకాంత్ రెడ్డి, సూపర్వైజర్ గంగాధర్, ఎన్యుమరేటర్ రమేష్ ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సర్వే పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం మేరకు వీలైనంత త్వరగా ఈ సర్వే పూర్తి చేసేలా కార్యాచరణను అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రజలంతా తప్పనిసరిగా సర్వేలో వివరాలు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని వారిని ఆదేశించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఈ మహా యజ్ఞాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

**రూ. 10 లక్షల పరిహారం..**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని ఈజ్గాంలో పులి దాడి ఘటనలో మరణించిన గన్నారం మండల వాసి కళ్యాణి కుటుంబానికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూ. 10 లక్షల పరిహారం అందజేత ప్రక్రియను పూర్తి చేసినట్లు కొండా సురేఖ ప్రకటించారు. పత్తి సేకరణకు వెళ్లిన కళ్యాణి పులి దాడిలో మరణించడం తనను ఎంతో వేదనకు గురి చేసిందన్నారు. శాఖాపరంగా అన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఈ దుర్ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. నష్టపరిహారంతో పాటు వారి కుటుంబ అవసరాల మేరకు తగిన విధంగా సహాయ, సహకారాలను అందిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.



## ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

### శాలువా కప్పి బొకే ఇచ్చిన మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, హైదారాబాద్ :** ములుగు నియోజకవర్గంలో కొత్తగా మల్లంపల్లి మండలాన్ని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్ లోని తన స్వగృహంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఆనాడు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో పాదయాత్ర సందర్భంగా రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే మల్లంపల్లి మండలంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. అదే విధంగా ములుగు నియోజక వర్గం పరిధిలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.73.47 కోట్లు కేటాయించేందుకు కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## సోషల్ మీడియాకు బాలలు దూరంగా ఉండాలి

- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య
- ఎమ్మెల్యేతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బాలలు సోషల్ మీడియాకు ఎంతదూరంగా ఉంటే అంతమంచిదని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శనివారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా స్థాయి బాలల దినోత్సవ వేడుకలను పిల్లలు, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ హనుమకొండ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం బాలల హక్కుల థీమ్ 'బాలల భవిష్యత్తు కొరకు బాలల హక్కుల కొరకై నిలబడదాం' అన్నారు. అదే విధంగా బాలలకు హెల్త్ అండ్ సేఫ్టీ గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ –1098 సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ బాలల హక్కుల వారోత్సవాలలో నిర్వహించే పలు కార్యక్రమాలు బాలలకు వారి హక్కులపై అవగాహన కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర ఈసీ మెంబర్ ఈవీ శ్రీనివాస్, కార్పొరేటర్ రావుల కోమల, ప్రాజెక్టు లెవెల్ సీడీపీఓలు స్వాతి, భాగ్యలక్ష్మి, సీడబ్ల్యూసీ మెంబర్స్, జిల్లా సంక్షేమాధికారి కార్యాలయ సిబ్బంది, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ బాల సదనాల నిర్వాహకులు, చైల్డ్ లైన్, డీసీపీయూ సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, అంగన్ వాడి పిల్లలు, వివిధ పాఠశాలల నుంచి 800 మంది చిన్నారులు పాల్గొన్నారు.



**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

గ్రేటర్ వరంగల్ 59డివిజన్ కనకదుర్గ కాలనీలో సుమారు రూ.75లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**కామెన్ మెస్ లో భోజనం..**

కాకతీయ విశ్వవిద్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం యూనివర్సిటీ ప్రాంగణంలోని కామన్ మెస్ లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య భోజనం చేశారు.

# ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆయుర్వేద దినోత్సవ వేడుకలలో భాగంగా శని వారం ప్రభుత్వ ఆయుర్వేద బోధనాసుపత్రి, అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయం బట్టల బజార్ వరంగల్ లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ వైద్యాధికారి డాక్టర్ జె. హరికిషన్, క్యాంప్ ఇంచార్జి వైద్యాధికారి డా.తాండ్ర ఈశ్వర్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ జిల్లా అధ్యక్షులు కొన్రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సదానందం, కార్పొరేటర్ కల్పన నవీన్ తో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్స్ డా.జి కవిత, డాక్టర్ హెచ్.జ్యోతి చే స్త్రీ సంబంధ వ్యాధులు, ఆయుర్వేద వైద్య చికిత్స విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 300 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.ఈశ్వర్, హౌస్ సర్జన్ డాక్టర్ హరీష్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ అఖిల, డాక్టర్ నిఖిల, డాక్టర్ చైతన్య భార్గవి, ఫార్మాసిస్ట్ లు భాగ్యలక్ష్మి, ఓదేలు, ఇతర వైద్య సిబ్బంది జారా, రాధా, జమీల్, లక్ష్మీ , శ్రీ వెంకటేశ్వర దేవాలయ కమిటీ అధ్యక్షుడు గంద గోవిందరాజులు, తణుకు నూరి అశోక్, వయోవృద్ధుల సంక్షేమ సంస్థ జిల్ల అధ్యక్షుడు కె.మల్లారెడ్డి, ఎన్.సదానందం, ప్రధాన కార్యదర్శితో పాటు, సహాయ కార్యదర్శి డా.రాజేంద్రప్రసాద్, డి.రాజమౌళి, సత్యనారాయణ, జోగి రెడ్డి, నిజాముద్దీన్, సూర్యనారాయణ, గోవర్ధన్, వెంకటస్వామి, సుధాకర్ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** పారిశుధ్య కార్మికులు డ్రెస్ కోడ్ ను పాటించడం వలన తమ విధులు నిర్వహించే ప్రాంతాల్లోని ప్రజల్లో మీరు చేస్తున్న పనులకు గుర్తింపు లభిస్తుందని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శనివారం కరీమాబాద్ ఎసు కె గౌడ్ కళాభవన్ లో మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో డివిజన్ లోని పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ మరుపల్ల రవి చేతుల మీదుగా ఆడవారికి రెండు చీరెలు, మగవారికి రెండు డ్రెస్సుల బట్టలను అందజేశారు. మహా నగర పాలక సంస్థ నుంచి వచ్చు వస్తువులు సరిగా అందటం లేదని, దీని వలన ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పారిశుధ్య కార్మికులు తెలుపగా కార్పొరేటర్ మరుపల్ల రవి స్పందించి చలి వానల నుంచి ఎండ వేడిని తట్టుకొని పనులు చేసే పారిశుధ్య కార్మికులకు మహా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రెయిన్ కోట్లు, ఆప్రాన్, బూట్లు, గ్లౌజులు, ఇతర వస్తువులు ఇప్పించటానికి అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానని కార్పొరేటర్ మరుపల్ల రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో జవాన్ పోలెపాక కొమురెల్లి, ప్రశాంత్, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

## మన అగ్రిటెక్ సందర్శన

### ఆధునిక పరికరాలను పరిశీలించిన విద్యార్థులు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఎనుమాముల మార్కెట్ లో మన అగ్రిటెక్ లో 365 రోజుల వ్యవసాయం పరికరాలకు ప్రదర్శనను కరీంనగర్ కు చెందిన మహాత్మా జోతిరావు పూలే వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మన అగ్రిటెక్ లో ప్రదర్శనలో ఉంచిన వందల రకాల ఆధునిక వ్యవసాయ పనిముట్లను ఒక్కొక్కటిగా వీక్షించి, వాటికి సంబంధించిన పూర్తి వివరాలను తమ పుస్తకంలో రాస్తూ అగ్రిటెక్ అధినేత పాషికంటి రమేష్ ను క్లుప్తంగా అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ రమేష్ ప్రదర్శనలో ఉన్న ఒక్కో స్టాల్ వద్దకు విద్యార్థులను తీసుకుపోయి వాటి గురించి పూర్తి వివరాలను వారికి అర్థమయ్యే విధంగా వివరించారు. నేటి విద్యార్థులే భవిషత్తుకు పునాదులని, వ్యవసాయ రంగంలో నూతన ఒరవడిని సృష్టించాలంటే విద్యార్థులందరూ రైతులకు ఆధునిక వ్యవసాయంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అగ్రిటెక్ ను పరిశీలించిన విద్యార్థి, అధ్యాపక బృందం ఇంత పెద్ద వ్యవసాయ పరికరాల ప్రదర్శన తామెప్పుడు చూడలేదన్నారు. ఇన్ని పనిముట్లను ఒకే చోట ఉంచి రైతులకు అందించడం గొప్ప విషయమని తెలిపారు. అగ్రిటెక్ ను సందర్శించడం చాలా సంతోషంగా ఉందని, విద్యార్థులకు సైతం ఆధునిక వ్యవసాయంపై మంచి జ్ఞానం పెంపొందించే విధంవగా ఈ ప్రదర్శన ఉందని పేర్కొన్నారు.

## ఏడీఎంఎస్ చైర్మన్ కు భగవద్గీత అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కర్ణాటక రాష్ట్రంలోని బెల్గావిలో ఈనెల 28, 29, 30 తేదీలలో జరిగిన ఏడీఎంఎస్ డెవలప్ మెంట్ ప్రోగ్రాంలో ఏడీఎంఎస్ సీఈఓ అశోక్ కుమార్ కు భగవద్గీతను ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్, నాగిళ్ల వేణు శర్మ అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఎంఎస్ సంస్థ సీఈఓ అశోక్ కుమార్ మాట్లాడుతూ భగవద్గీత నేటి మానవాళి నిత్యజీవితంలో మానసికంగా, శారీరకంగా ఎదగడానికి ఎంతగానో దోహదపడుతుందని తెలియజేస్తూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వెహికల్ ను ప్రజలకు అందుబాటులో ఉంచడమే కాకుండా ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలనే సత్సంకల్పంతో ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు మానవ జీవితంలో అవసరమయ్యే నిత్యావసర వస్తువులను 101 రకాల ప్రోడక్ట్ లను ఏడీఎంఎస్ కంపెనీ లాంచ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంఎస్ సంస్థ డైరెక్టర్లు మహేష్, దిలావర్, షాహినీతో పాటు వరంగల్ నుంచి ఏడీఎంఎస్ లీడర్ రచ్చ శ్రీనివాస్, సుభాష్, మనీష్ జోషి పాల్గొన్నారు.

## యూనిటీ ఆఫ్ స్టాచ్ సందర్శన




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి తమ గుజరాత్ రాష్ట్ర పర్యటనలో భాగంగా నర్మదా నది తీరంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తుగా, ఐక్యతకు మారుపేరుగా నిలిచి, భారతదేశ స్వాతంత్ర పోరాటంలోనే గాక మొట్టమొదటి హోమ్ మినిస్టర్ గా పనిచేస్తూ సుమారు 565 రాజుల సంస్థానాలను భారతావనిలో విలీనం చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారకార్థం నిర్మించిన యూనిటీ ఆప్ స్టాచ్ ను శనివారం సందర్శించారు. స్టాచ్ ఆఫ్ యూనిటీ అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎంతో ఆకర్షణీయంగా నిర్మిచడం వలన ప్రపంచవ్యాప్త పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు. ఇలాంటి చారిత్రాత్మక విశేషాలను వివరిస్తూ అభివృద్ధి చేయబడిన పర్యాటక ప్రదేశాలు, చారిత్రాత్మకంగా నిలిస్తూమరపురానివిగా భారతావనికి వన్నెతెస్తున్నాయివి.

## విద్యార్థులకు ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్ లో ఉల్లాస్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రైల్వే గేట్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల శివనగర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాలెం హనుమకొండ పాఠశాలకు చెందిన 40 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున ఉల్లాస్ ట్రస్ట్ బోర్డ్ అడ్వైజర్ అవినాష్, మయూర్ ఉల్లాస వరంగల్ కన్వీనర్, కోఆర్డినేటర్ పీఎల్ నరేందర్ అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ అధ్యక్షత వహించగా పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, కొండ యాదగిరి, వెంకటేశ్వర్ రెడ్డి, రామానుజయ్య చంద్రమోహన్ సింగ్, కల్పన, సృజన, పాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రాంజీ, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే అనేక అంశాలను విద్యార్థులకు ప్రబోధించడం జరిగిందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజాభివృద్ధికి దోహదపడతాయని వివరించారు.

# నర్సింగ్ విద్యార్థులకు ఎయిడ్స్ పై అవగాహన



**వరంగల్ వాయిస్, కాటారం :** ప్రపంచ ఎయిడ్స్ దినం డిసెంబర్ 1ని పురస్కరించుకొని శనివారం కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాటారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్ హెచ్ పీ డాక్టర్ వందన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మహాదేవపూర్ సమీకృత సలహా పరీక్ష కేంద్రం (ఐసీటీసీ) కౌన్సిలర్ గాదె రమేష్ అవగాహన కల్పించారు. హెచ్ఐవీ నిర్వచనం, వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుమానాలు, అపోహలు, వివరణ, ఎయిడ్స్ మందులు, తప్పనిసరి గర్భిణీ స్త్రీల పరీక్షలు, రెడ్ రిబ్బన్ క్లబ్బుల ఏర్పాటు ఆవశ్యకత తదితర అంశాలపై కూలంకషంగా ముఖాముఖిగా ప్రశ్నోత్తరాల రూపంలో అవగాహన కల్పించారు. సమాజంలో హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి చాప కింద నీరు లాగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు, యువత మేల్కొని సమాజాన్ని జాగృతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేష్ అన్నారు. ముందస్తుగా రక్త పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ చేయించుకోవడం ప్రతి ఒక్కరిపై బాధ్యత ఉందన్నారు. ఒకవేళ హెచ్ఐవీ పాజిటివ్ గా నిర్ధారణ జరిగితే ఏఆర్టి మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాటారం ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్, వివేకానంద ఒకేషనల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వందన, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఫిజియోథెరపిస్ట్ వెంకన్న, స్టాఫ్ నర్స్ అభినయ, వివేకానంద స్కూల్ డీఎంఎల్ టీ ఇన్ స్ట్రక్టర్ రుచిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులపై నిర్లక్ష్యం సరికాదు

## ఏఐఎస్ఎఫ్ నేత ల్యాదెల్ల శరత్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన దగ్గర పెట్టుకొని విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని AISF వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదెల్ల శరత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి లేకుండా సంవత్సరం పాలనలో విద్యావ్యవస్థపై సమీక్ష ఏదని ప్రశ్నించారు. గురుకుల, సంక్షేమ హాస్టల్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురవుతున్నారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలని, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి శనివారం ఏఐఎస్ఎఫ్ ప్రభుత్వ పాఠశాలల బంద్ ఇచ్చిన పిలుపులో భాగంగా కరీమాబాద్ బీరన్నకుంట ప్రభుత్వ పాఠశాలలు బంద్ చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, అలాగే నాణ్యమైన బోధన, భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో AISF జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్సాంపల్లి సాగర్, నాయకులు శివ, అభిరామ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కిల్స్ పై అవగాహన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని గోపాల్ పూర్ సర్కిల్ లోని క్యాంబ్రిడ్జ్ మాంటిసోరి ప్రీస్కూల్ వారు విద్యార్థులకు సృజనాత్మకత కోసం జీవన విధివిధానాలు, మనీ మేనేజ్ మెంట్ లపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. విద్యార్థులను రోడ్డుపై నడక మార్గంలో ట్రాఫిక్ నియమాలను తెలుపుతూ దగ్గరలో ఉన్న సూపర్ మార్కెట్ కు తీసుకెళ్లారు. అక్కడ మనీ మేనేజ్ మెంట్, సోషియల్ బిహేవియర్ స్కిల్స్ పై ప్రత్యక్ష విషయ పరిజ్ఞానం అందించారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించిన గోపాల్ పూర్వాసులు స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. విద్యార్థినీ విద్యార్థులతో ముచ్చటించి వారి చిన్ని అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ తాబేటి శ్రావణి, సిబ్బంది బాలాజీ రమ్య, శ్వేత, దివ్య, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు కివి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఎగ్జిబిట్ ఎంపిక



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పిల్లల్లో సైన్స్ పట్ల సృజనాత్మకతను వెలికితీయడానికి ప్రతి సంవత్సరం నిర్వహించే విద్యా వైజ్ఞానిక ప్రదర్శన సైన్స్ ఫెయిర్ ఈనెల 26, 27, 28 తేదీలలో నర్సంపేటలోని గల శివాని పబ్లిక్ స్కూల్లో జరగగా జిల్లా స్థాయిలో సుమారు నూట నలభై ఎనిమిది పాఠశాలలో పాల్గొనడం జరిగింది. ఇందులో భాగంగా ఎస్ఆర్ తోటలోని కివి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని సల్ల వినూత్న గైడ్ టీచరు మండల రమేష్ బాబు పర్యవేక్షణలో లైట్ పైపు అనే అంశాన్ని ప్రదర్శించింది. ప్రదర్శనను తిలకించిన వారు అభినందిస్తూ ప్రోత్సహించడం జరిగింది. చివరగా ఈ ఎగ్జిబిట్ ను రాష్ట్ర స్థాయిలో జరిగే వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఈ సందర్భంలో ఈ ఎగ్జిబిట్ ప్రదర్శించిన విద్యార్థిని ఉత్తమ ప్రదర్శన సర్టిఫికెట్ తో పాటు మూమెంటో డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థిని, గైడ్ టీచర్లు రమేష్ బాబును, సైన్స్ టీచర్ దివ్యను పాఠశాల ప్రిన్సిపల్ దాసి సతీష్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ అన్నదేవర ప్రవీణ్ కుమార్, ఇతర అధ్యాపక బృందం అభినందించారు.

# ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలలో జరుగుతున్న వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలకు నిరసనగా ఏఐఎస్ బీ, పీడీఎస్ యూ, యూఎస్ఎఫ్ఐ సంఘాలు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రభుత్వ పాఠశాలల బంద్ వరంగల్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు వరంగల్ నగరంలో జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల బంద్ ను పర్యవేక్షించారు. బంద్ లో భాగంగా శంభునిపేట్ ప్రభుత్వ పాఠశాలలో తరగతులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ బీ జిల్లా కన్వీనర్ రోహిత్, పీడీఎస్ యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అర్జున్, మిశ్రీన్ సుల్తానా, యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రంజిత్ నాయక్ లు మాట్లాడుతూ సంవత్సర కాలంగా రాష్ట్రవ్యాప్తంగా 38 సార్లు ఫుడ్ పాయిజన్ జరిగిన కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికి ఆరుగురు ఆత్మహత్య చేసుకున్నారు. 8 మంది అనారోగ్యాల బారిన పడినా ఈ ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిచటం ఏంటని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ పాఠశాలలో మెస్ కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ పాయిజన్ సంఘటనలు మళ్లీ జరగకుండా పర్యవేక్షించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ సంఘాల ఆధ్వర్యంలో ప్రజాభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా కోశాధికారి రేవంత్, నాయకులు మధు, ఏఐఎస్ బీ నాయకులు, సతీష్, యూఎస్ఎఫ్ఐ నాయకులు చందు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

## ఎస్ఎఫ్ఐ బంద్ విజయవంతం




**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** విద్యార్థుల ప్రాణాలతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు దీకొండ భరత్ అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. గత నెల రోజుల నుంచి రాష్ట్రంలోని గురుకులాలలో, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి చనిపోతూ ఉంటే ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో వరుస ఘటనలతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. ఇంత జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించడం లేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో ఉన్న సమస్యలతో విద్యార్థులు సతమతవుతున్న వారి సమస్యలను పరిష్కరించే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మృతికి ప్రభుత్వం మే బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బంద్ కార్యక్రమం లో భాగంగా మండలంలో చేపట్టిన కార్యక్రమం విజయవంతమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు రాములు, మండల నాయకులు నరేష్, సాయితేజ, కిరణ్, లక్ష్మి నారాయణ, భాగ్య కిరణ్, ప్రేమ్ చంద్ నాయక్, సాయిరాం, చంద్ పాల్గొన్నారు

# అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** లాల్ బహదూర్ కళాశాలలో ఎన్సీసీ ఆర్మీ పదవ తెలంగాణ బెటాలియన్ "ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవాన్ని" నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి తెలిపారు. ప్రపంచాన్ని అత్యంత భయానికి గురిచేసిన ఎయిడ్స్ వ్యాధి నేడు అన్ని దేశాల్లో నియంత్రించ గలుగుతున్నామని దానికి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వలన తగ్గుముఖం పట్టిందన్నారు. రక్త మార్పిడి, రోగ నిరోధక శక్తి వంటిపై అవగాహన లేకపోవడం, మానవ తప్పిదం వల్లనే లక్షలాదిమంది మరణిస్తున్నారని తెలిపారు. నేడు మన ప్రభుత్వం, ప్రపంచ ఆరోగ్య సంస్థసంస్థ, యునైటెడ్ నేషనల్ ఆర్గనైజేషన్ అన్ని దేశాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమం నిర్వహించడం వలన ఇది నియంత్రణ సాధ్యమైందని విద్యార్థులకు తెలిపారు. ములుగు రోడ్డు జంక్షన్ కేఎంసీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలు పాటిస్తే ఎయిడ్స్ నియంత్రణ సులభమని పేర్కొన్నారు. విస్తృత ప్రచారమే దాని నివారణకు ప్రధాన కారణమని, ప్రజల్లో చైతన్యం నింపాలని వైస్ ప్రిన్సిపాల్ కోరారు. కళాశాల ఎన్సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, నగేశ్, శాలిని, రజినీకాంత్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పై బీఆర్ఎస్ అసత్య ప్రచారం



**వరంగల్ వాయిస్, దామెర:** తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబంతో సహా బీఆర్ఎస్ నాయకులు ఇష్టం వచ్చినట్లు దోచుకుని నాశనం చేశారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినా బీఆర్ఎస్ అబద్ధాలు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. గ్రామాల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని, అన్ని రకాల పదవుల్లో నాయకులకు అవకాశం ఇస్తామని తెలిపారు.

# విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడొద్దు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడితే కాంగ్రెస్ ప్రభుత్వ పతనం తప్పదని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలకు, విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వానిదే బాధ్యత అని అన్నారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బంద్ విజయవంతమైంది. శనివారం వామపక్ష విద్యార్థి సంఘాల "రాష్ట్రవ్యాప్త ప్రభుత్వ పాఠశాలల బంద్" పిలుపులో భాగంగా హన్మకొండ జిల్లా కేంద్రంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ యూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో "ప్రభుత్వ పాఠశాలల్లో తరగతులు బహిష్కరించి, బంద్" నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండలోని సుబేదారి హైస్కూల్ వద్ద జరిగిన కార్యక్రమానుద్దేశించి పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా హాస్టల్ విద్యార్థుల ఫుడ్ పాయిజన్ ఘటనలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఫుడ్ పాయిజన్ వలన మరణించిన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ఫుడ్ పాయిజన్ ఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జి చే సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా నాయకులు అరుణ్ వినయ్, రాజకుమార్, జస్వంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్, కుంటి పవన్, వి.అఖిల్, పీడీఎస్ యూ జిల్లా నాయకులు వంశీ, పృథ్వీరాజ్, వినయ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పంతకాని రాజుకు వరల్డ్ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ డే అవార్డు




**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ పంతకాని రాజు "ఆదివాసీ జీవన కళా సౌందర్యం" పై తీసిన ఫొటోకు "పిక్టోరియల్" "కళాత్మక ఉత్తమ ఛాయా చిత్రకారుడి అవార్డు లభించింది. 132వ "వరల్డ్ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ డే" డిసెంబర్ 1 సందర్భంగా ఉభయ రాష్ట్రాలకు "ఆచార్య నాగార్జున యూనివర్సిటీ" ఆధ్వర్యంలో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్" అండ్ " ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా" సహకారంతో నిర్వహించిన "ఫోటో కాంటెస్ట్" లో ఈ అవార్డు లభించింది. శనివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఆవరణలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ రామ మోహన రావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ గంగాధర రావు, డిపార్ట్మెంట్ ఆఫ్ జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ బాధ్యులు డా.మధు బాబు, కార్యక్రమ సమన్వయ కర్త తమ్మ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా మెరిట్ సర్టిఫికెట్, మెడల్ ను అందుకున్నారు. ప్రకృతి, సహజమైన జీవన చిత్రాలు రేపటికి ఒక రూపంగా, కళాత్మకంగా భద్రపరిచే పిక్టోరియల్ ఫొటోగ్రఫీలో ఈ అవార్డు రావడం మాకు చాలా సంతోషంగా ఉందని పంతకాని రాజు అన్నారు.

## మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయండి



**వరంగల్ వాయిస్, కాటారం :** మాలల సమస్యలపై భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సమరం సాగించేందుకు, ఐక్యత కోసం నిర్వహించే మాలల సింహ గర్జన సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఉత్తర తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పీక కిరణ్ విజ్ఞప్తి చేశారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూరు ఎమ్మెల్యే జి వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో హైదరాబాదులో ఆదివారం నాడు జరప తలపెట్టిన మాలల సింహ గర్జన సభను రాజకీయాలకతీతంగా, కులాలకు అతీతంగా, ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని కోరారు. ఏ కులానికి ఈ సభ వ్యతిరేకం కాదని, ఇది కేవలం మాలల సమస్యలపై, వివక్షతకు వ్యతిరేకంగా, మాలల హక్కుల సాధన కోసం సమావేశం నిర్వహిస్తున్నట్లు పీక కిరణ్ వెల్లడించారు.

## ఘనంగా సివిల్ రైట్స్ డే



**వరంగల్ వాయిస్, దామెర :** మండంలోని కొగిల్వాయి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి, దామెర ఎస్సై అశోక్, ఏఈ రమేష్, గిర్దావార్ భాస్కర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ సరళ పాల్గొన్నారు.

## పర్యావరణ దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని సెయింట్ థామస్ (నిట్ వరంగల్) ఉన్నత పాఠశాలలో శనివారం గ్రీన్ డే పర్యావరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండంట్ మనోహర్ పిల్లలకు పచ్చదనం గురించి వివరించి అవగాహన తెలియజేస్తూ ప్రతి ఒక్కరు వారి పుట్టిన రోజు నాడు ఒక మొక్కను నాటి ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, ఆత్మకూర్ :** మండలంలోని గూడెప్పాడు గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ కోఆప్షన్ సభ్యులు బాబు మియా (చిరు) తమ్ముడైన మహ్మద్ రఫీ (48) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగూర్ల వెంకటేశ్వర్లు మృతుడి ఇంటికి వెళ్లి వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు లెక్కల శ్రీనివాస్ రెడ్డి, జూపాక భాస్కర్, వంచరగిరి వీరేశం, షమీన్ పాషా, జానీ మియా, అజ్మత్ పాషా, యాకుబ్ అలీ, కమలోద్దీన్, సలీం పాషా పాల్గొన్నారు.

# షేక్ ఫక్రుద్దీన్ కు అమెరికా హానర్ అవార్డు



**వరంగల్ వాయిస్, మరిపెడ :** ప్రతిష్ఠాత్మక అమెరికా హానర్ అవార్డ్ ను మరిపెడ ఆర్ట్ ఫొటోగ్రాఫర్ షేక్ ఫక్రుద్దీన్ అందుకున్నారు. శనివారం వరల్డ్ ఫొటోగ్రఫీ డే 2024 సందర్భంగా ఇమేజ్ కొలీగ్ సొసైటీ అమెరికా వారు ప్రకటించిన అవార్డును 132వ ప్రపంచ పిక్టోరియల్ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.రామమోహన రావు అందజేశారు. ప్రపంచ వ్యాప్తంగా 28 మందికి అలాగే మన భారతదేశంలో 11మంది ఫొటోగ్రాఫర్లకు అవార్డులను ఇమేజ్ కొలీగ్ సొసైటీ అమెరికా (ఐసీఎస్) ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం వారు నిర్వహించారు. ప్రతిష్టాత్మక అవార్డు అందుకోవడంతో ఫొటోగ్రఫీ మిత్రులు, బంధువులు ఫక్రుద్దీన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ కె.రామమోహనరావు, చైర్మన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రొపెసర్ కె.గంగాధరరావు, వైస్-ఛాన్సలర్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొ.కె.రత్న శీలా మణి, రెక్టార్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.సింహాచలం, రిజిస్ట్రార్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొ.ఎం.సురేష్ కుమార్, ప్రిన్సిపాల్, ఏఎన్ యూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా డా.జె. మధు బాబు,హెడ్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ విభాగం జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, ఫొటోగ్రఫీ అధ్యాపకులు రెండు రాష్టాలకు చెందిన ఆర్ట్ ఫొటోగ్రాఫర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంజీఎం వ్యాక్సినేషన్ సెంటర్ పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ (పీపీ యూనిట్)ను వ్యాక్సినేషన్ కేంద్రాన్ని శనివారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఐ.ప్రకాశ్ పరిశీలించారు. ఎంజీఎం (పీపీ యూనిట్) లో వ్యాధి నిరోధక టీకాలు నిల్వ చేసే కోల్డ్ చైన్ సిస్టంను పరిశీలించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐఓ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలని స్టాఫ్ ను కోరారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరాల పట్ల ఎప్పటికప్పుడు సమాచారాన్నిసేకరించాలని, చలి తీవ్రత ఎక్కువగా ఉందని, ఇలాంటి సమయంలో బయట తిరుగడం మంచిది కాదని తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం జమున, ఎంఎన్ఓ రామ రాజేష్ ఖన్నా, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తాం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి మళ్లీ పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికులుగా పనిచేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బక్క రామచంద్రయ్య, రాష్ట్ర నాయకులు ఎడ్ల మల్లేష్, నరసయ్య, మొహమ్మద్ జహంగీర్ పిలుపునిచ్చారు. శనివారం రఘునాథ్ పల్లి మండలం వెల్డి, జఫర్ గూడెం గ్రామాలలో పార్టీ సభ్యత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి గతంలో పనిచేసిన పాత, కొత్త నాయకులు అందరు కలిసి మళ్లీ పార్టీలోకి రావాలని వారు కోరారు. నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో తెలంగాణలో పార్టీకి మళ్లీ జీవం పోస్తూ ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జిల్లా నాయకులు కొంగర నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## నాగవెల్లి సురేష్ కుమార్ కు అవార్డు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** బాక్వార్డ్ క్లాసెస్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ( BICCI)ఆధ్వర్యంలో ఎంటర్ ప్రెన్యూరల్ అవార్డ్స్ -2024 , ఉత్తమ ఎంటర్ప్రీనర్ అవార్డ్" సర్వీసెస్ విభాగంలో హనుమకొండకు చెందిన గోపి సెలూన్ యజమాని నాగవెల్లి సురేష్ కుమార్ కు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, పరికిపండ్ల నరహరి IASప్రిన్సిపుల్ సెక్రటరీ గవర్నమెంట్ ఆఫ్ మధ్యప్రదేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. బీసీ యువతను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ముఖ్య ఉద్దేశంతో BICCI అవార్డ్స్ ప్రదానం చేస్తున్నటు నిర్వాహకులు డా.దాసరి కిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మధుసూదన చారి, చేరాల నారాయణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. క్షౌరవృత్తిని ప్రొఫెషన్ గా, సర్వీస్ ఇండస్ట్రీగా తీర్చిదిద్ది యువతకు ఆదర్శంగా నిలిచినందుకు హనుమకొండ "గోపి సెలూన్ " నాగవెల్లి సురేష్ కుమార్ ను టీహబ్ , హైదరాబాద్ నందు అవార్డు ప్రదానం చేశారు.

# శరణం శరణం అయ్యప్పా..

## ఘనంగా పడిపూజ



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** స్వామియే శరణం అయ్యప్పా.. శరణం శరణం అయ్యప్పా.. స్వామి శరణం అయ్యప్పా' అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో డోర్నకల్ పట్టణం మార్మోగింది. శ్రీ అయ్యప్పస్వామి మహాపడి పూజ మహోత్సవం డోర్నకల్ పట్టణంలో 6వ కౌన్సిలర్ తేజావత్ సంధ్య రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి గురస్వామి జానయ్య, మల్సూర్ తో పాటు సుమారు 300 మంది స్వాములు పాల్గొని అయ్యప్పస్వామి నామ స్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపిస్తూ ప్రత్యేక పూజలు, పంచామృతాల అభిషేకాలు ఘనంగా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. దేవుడి నామస్మరణలోనే మనిషికి ముక్తి లభిస్తుందని, భగవంతుని ధ్యానంతో మనిషి ప్రశాంతత పొందుతారన్నారు. ఇతర ప్రాంతాల మాలాధారణ స్వాములు ఈ పడిపూజ మహోత్సవానికి వచ్చి స్వామి వారి ఆటపాటలను తిలకించారు. పట్టణవాస్తులంతా సుఖసంతోషాలతో జీవించాలని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు అన్నదానం (భిక్ష) ఏర్పాటు చేశారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



**వరంగల్ వాయిస్, దామెర :** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఫుడ్ పాయిజన్ పై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి ఓ.చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం దామెర మండలం కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలోని మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన ఆహారం అందక విద్యార్థులు బాధపడుతున్నారని ఫుడ్ పాయిజన్ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అనేకసార్లు పాఠశాలలో మధ్యాహ్న భోజన సమస్య వస్తున్న కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు బి.రాజకుమార్, నక్క దీక్షిత్, యస్.సాయి కృష్ణ, డి.వరుణ్, శివకుమార్, రాజు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ 59డివిజన్ కనకదుర్గ కాలనీలో సుమారు రూ.75లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ కనకదుర్గ కాలనీలో ఎక్కువగా సీనియర్ సిటిజన్స్ ఉన్నారని వారికి ఉపయోగపడే విధంగా పార్క్ అభివృద్ధి చేయాలని అందులో భాగంగానే 2నెలల క్రితమే కమిషనర్ తో కలిసి పార్క్, రోడ్లు, డ్రైనేజీలను పరిశీలించినట్లు తెలిపారు. అందులో భాగంగానే శనివారం రూ.74.95లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత, మహేందర్ రెడ్డి, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## ➲ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, గీసుగొండ :** మండలంలోని కొనయమాకుల రైతు వేదికలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో రైతు కుటుంబాలు ఆనందంగా ఉన్నాయని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ రైతుకు మంచి రోజులు వచ్చాయని తెలిపారు. పంట బోనస్ రూ.500 ప్రకటనతో పెరిగిన సన్నాలు సాగు పెరిగిందని, నేడు మరో 4 లక్షల మందికి రుణమాఫీ చేస్తున్నామన్నారు. సంక్రాంతి నుంచి ఎకరాకు రూ.7,500/- రైతు భరోసా సాయం ఇవ్వబోతున్నామని తెలిపారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జమిలి ఎలక్షన్లు వస్తాయని, మరల కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదు పట్టించడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యమని, అసత్యపు ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు.

# రాష్ట్ర స్థాయి ఇన్ స్పైర్ పోటీలకు విద్యార్థి ఎంపిక

## అభినందించిన మండల విద్యా శాఖాధికారి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** ఇటీవల నర్సంపేటలోని శివాని పబ్లిక్ స్కూలులో ముగిసిన జిల్లాస్థాయి ఇన స్పైర్, సైన్స్ ఫేర్ ఎగ్జిబిషన్ లో పర్వతగిరి మండలం రోళ్లకల్ పాఠశాలకు చెందిన మడ్డి శివాని రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా మండల విధ్యాశాకాధికారి జి.లింగా రెడ్డి, పర్వతగిరి పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పాక రమేష్ లు విద్యార్థినిని అభినందించారు. త్వరలో కామారెడ్డి జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఇన్ స్పైర్ పోటీలలో చక్కని ప్రదర్శన చూపి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆశీర్వదించారు. పాకెట్ సైజ్ ఫోల్డబుల్ జాకెట్ ఫర్ ఫీడింగ్ మదర్ అనే ప్రాజెక్టుతో రాష్ట్ర స్థాయికి ఎన్నికైన శివాని 2023-24 విద్యా సంవత్సరంలో ప్రాథమికోన్నత పాఠశాల, రోళ్లకల్ లో 7వ తరగతిలో జిల్లా స్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్ట్ కు రోళ్లకల్ పాఠశాల ప్రదానోపాధ్యాయులు పి.సురేష్ బాబు గైడ్ టీచర్ గా వ్యవహరించారు. రద్దీ ప్రాంతాల్లో పాలిచ్చే తల్లులు తమ పిల్లలకు పాలు ఇవ్వలేక పడుతున్న ఇబ్బందులను చూసి ఈ ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థినిని పలువురు ప్రశంసించారు. ప్రస్తుతం శివాని కస్తూర్బా గాంధీ బాలికా పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. ఈ కార్యక్రమంలో రోళ్లకల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై చార్జిషీట్ తయారు చేయాలి

## మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై భారతీయ జనతా పార్టీ చేపట్టబోతున్న యాత్ర కార్యక్రమాలపై శనివారం హంటర్ రోడ్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి వర్క్ షాప్ లో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అరూరి రమేష్ హాజరై మాట్లాడుతూ డిసెంబర్ 1 నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ నిర్వహించబోయే యాత్ర కార్యక్రమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలపై చార్జిషీట్ తయారు చేయాలని తెలియజేశారు. అలాగే ప్రతి డివిజన్లలో మండలాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించాలని తెలియజేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే విధంగా ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాదయాత్ర ప్రముఖ్ రత్నం సతీష్ షా, అసెంబ్లీ ప్రముఖ్ బన్న ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, తక్కలపల్లి రాజేశ్వరరావు, జలగం రంజిత్, నాంపల్లి శ్రీనివాస్, వన్నాల వెంకటరమణ, మజ్జిగ జైపాల్, మాజీ జడ్పీటీసీ రేణికుంట్ల సునీత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆటోవాలా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

## ● రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్



**వరంగల్ వాయిస్, కాటారం :** ఆటోవాలాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో ఆటో యూనియన్ల జేఏసీ అధ్యక్షుడు పేట బక్కయ్య అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటో డ్రైవర్ల మీద విరుచుకు పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ బస్సులలో మహాలక్ష్మి ఉచిత బస్సు టికెట్ పథకాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఆటోలకు గిరాకీలు పడిపోయాయని, దాంతో మహిళలు ఆటో ఎక్కడమే మానేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 65 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మృతి చెందిన ఆటో డ్రైవర్లకు రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని, అలాగే వారి కుటుంబాలలో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.1000కోట్ల బడ్జెట్ తో ఆటోవాలా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో తమ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా నెలకు రూ.12 వేలను ఆటో డ్రైవర్లకు జీవనభృతిగా యుద్ధ ప్రాతిపదికన చెల్లించాలని సమావేశం తీర్మానించింది. కాటారం మండల ఆటో డ్రైవర్ యూనియన్ జేఏసీ కమిటీ అధ్యక్షులుగా పేట భక్కయ్య, ఉపాధ్యక్షులుగా మారపాక వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా జిల్లాల శంకర్, అధికార ప్రతినిధిగా మంతని మహేష్, కోశాధికారిగా అంగడి వెంకటేష్, కార్యదర్శులుగా గద్దల తిరుపతి, సంఘం మల్లయ్య, సహాయ కార్యదర్శిగా చీర్ల శ్రీనివాస్ లను ఎన్నుకున్నారు.



# రామ్‌చరణ్ సినిమాలో మీర్జాపూర్ మున్నాభయ్యా

గ్లోబర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో ఓ చిత్రం పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. 'ఆర్‌సీ16' వర్కింగ్ టైటిల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ కలసి ఈ ప్రాజెక్టును నిర్మించనున్నాయి. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ డ్రామాగా దీన్ని తీర్చిదిద్దనున్నారు మేకర్స్. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం కర్ణాటకలో షూటింగ్ ప్రారంభించింది. అయితే ఈ సినిమాలో మీర్జాపూర్ వెబ్ సిరీస్ నటుడు దివ్యేండు శర్మ కీలక పాత్రల్లో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను నిజం చేస్తూ.. దర్శకుడు బుచ్చిబాబు సనా 'ఆర్‌సీ16'లో మున్నా భయ్యా నటించబోతున్నాడు అంటూ ప్రకటించాడు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. మీర్జాపూర్ వెబ్ సిరీస్‌లో మున్నా భయ్య పాత్రల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు దివ్యేండు. దీంతో 'ఆర్‌సీ16' సినిమాకు అతడు ప్లస్ అవుతాడని చిత్రబృందం భావించినట్లు ఉంది. మరోవైపు ఈ సినిమాలో చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించనుండగా.. రెహమాన్ సంగీతం అందించబోతున్నాడు.





## పుష్ప టికెట్ రేట్ల పెంపునకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కథానాయకుడిగా వస్తున్న పాన్ ఇండియన్ మూవీ 'పుష్ప2: ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో రష్మిక మందన్నా కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పుష్ప 2 టికెట్ ధరలు పెంచుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల నుంచి బెనిఫిట్ షోలతో పాటు అర్ధరాత్రి 1 షోలకు అనుమతినిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సింగిల్ థియేటర్‌లలో, మల్టీప్లెక్స్‌ల్లో ఈ బెనిఫిట్ షోలకు టికెట్ ధరలు రూ.800గా ఖరారు చేసింది. మరోవైపు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఎక్స్‌ట్రా షోలకు అనుమతినిచ్చింది. డిసెంబర్ 05 నుంచి 08 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచింది. అలాగే.. డిసెంబర్ 09 నుంచి 16 వరకు సింగిల్ థియేటర్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150 పెంపునకు అనుమతిని ఇచ్చింది. డిసెంబర్ 17 నుంచి 23 వరకు సింగిల్ థియేటర్‌లలో రూ.20 మల్టీప్లెక్స్‌లో రూ.50 పెంపునకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



## ఓటీటీలోకి..

### మట్కా..



విడుదలై నెల కూడా కాకుండానే ఓటీటీలోకి రాబోతుంది వరుణ్ తేజ్ మట్కా మూవీ. వరుణ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ డిజాస్టర్‌గా నిలిచిన ఈ సినిమా తాజాగా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. మెగా హీరో వరుణ్ తేజ్‌కి ఈ మధ్య అసలు కలిసి రావాట్లేదన్న విషయం తెలిసిందే. అప్పుడెప్పుడో ఫిదా, తొలిప్రేమ సినిమాలతో సాలిడ్ హిట్లు అందుకున్న ఈ కుర్ర హీరో కెరీర్ గ్రాఫ్ సడన్‌గా పడిపోయింది. ఆపరేషన్ వాలంటైన్, గాండీవ ధారి అర్జున, గని సినిమాలతో వరుస డిజాస్టర్‌లను అందుకున్నాడు. ఇప్పుడు మట్కా సినిమాతో తాజాగా మరో డిజాస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఈ సినిమా ఎంతటి పరజయం అందుకుంది అంటూ కనీసం పెట్టిన బడ్జెట్ కూడా రాకపోవడం విశేషం. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ సినిమా డిసెంబర్ 05 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడిరచింది. పలాస 1978 సినిమాతో హిట్ అందుకున్న కరుణ కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. విజేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి ఈ సినిమాను నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయికగా నటించింది.

### అమరన్..



తమిళ అగ్ర కథానాయకుడు శివ కార్తికేయన్, నటి సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ అమరన్. ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ అనే పుస్తకంలోని మేజర్ వరదరాజన్ కథ ఆధారంగా వచ్చిన ఈ సినిమాకు రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వం వహించాడు. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. శివ కార్తికేయన్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలవడమే కాకుండా రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. థియేటర్‌లో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం తాజాగా ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 05 నుంచి తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రంలో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో నటించగా.. కమల్ హాసన్, మహేంద్రన్, సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, గాడ్ బ్లెస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి నిర్మించారు.

## వడ్డీతో సహా వస్తుంది.. గుర్తు పెట్టుకో ..

దక్షిణాది సినీరంగంలో నయనతార–ధనుష్ మధ్య నెలకొన్న వివాదం హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే నయనతార జీవితం ఆధారంగా రూపొందించిన 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' డాక్యుమెంటరీ విషయంలో మొదలైన వివాదం మరింత జటిలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కర్మ సిద్ధాంతాన్ని ఉదహరిస్తూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో నయనతార పెట్టిన పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'కర్మ సిద్ధాంతం ఏం చెబుతుందంటే.. అబద్ధాలతో పక్కవారి జీవితాన్ని నువ్వు ధ్వంసం చేస్తే.. దానిని ఓ అప్పుగా భావించు. అది సరైన సమయంలో వడ్డీతో సహా నీ దగ్గరకే వస్తుంది' అంటూ నయనతార తన పోస్ట్‌లో పేర్కొంది. ధనుష్‌ను ఉద్దేశించే ఆమె ఈ పోస్ట్‌ను పెట్టిందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ధనుష్ తీరును తప్పుబడుతూ ఓ బహిరంగ లేఖను విడుదల చేసింది. అక్కడ మొదలైన వివాదం ధనుష్ వరుసగా ఇస్తున్న కోర్టు నోటీసులతో ఇంకా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పరోక్షంగా ధనుష్‌ను ఉద్దేశించి నయన్ ఈ పోస్ట్ పెట్టిందని చెన్నై సినీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.



8 WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, నవంబర్ 30, 2024




# రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక
- ఘనంగా ప్రారంభమైన ఐఏఎల్ రాష్ట్ర మహాసభలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైనదని, రాజ్యాంగ పరిరక్షణ అందరి సమష్టి బాధ్యత అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. శనివారం హనుమకొండలోని స్థానిక కాకతీయ హరిత హోటల్ లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తొలుత మహాసభల ప్రాంగణంలో ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్ల మాధవరావు ఐఏఎల్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ప్రారంభమైన రాష్ట్ర మహాసభలకు ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా తెలంగాణ హై కోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక హాజరయ్యారు. ఈ సందర్భంగా 'భారత రాజ్యాంగం ఉద్దేశాలు' అనే అంశంపై జస్టిస్ నగేష్ బీమపాక మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు, త్యాగాల ఫలితంగా మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ఎంతో మంది మహానుభావులు దేశాన్ని, రాజ్యాంగాన్ని ముందుకు నడిపించారని అన్నారు. మన దేశ రాజ్యాంగం 75 ఏళ్లు గడిచినా పటిష్టంగా ఉందని, సాంఘిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం లక్ష్యాలుగా నమ్మకం, విశ్వాసం, వ్యక్తి స్వేచ్ఛ మన రాజ్యాంగం గొప్పతనం అన్నారు. ఈ క్రమంలో రాజ్యాంగ పరిరక్షణకు, ప్రజల హక్కుల రక్షణ కొరకు న్యాయవాదులు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. మహాసభలలో తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఐఏఎల్ ప్రతిష్టాత్మక సంస్థ అని, ఎంతోమంది పోరాటాల ఫలితంగా ఏర్పడిందని, ఈ మహాసభలలో న్యాయవాదుల సమస్యలపై చర్చించి తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి రాష్ట్ర బార్ కౌన్సిల్ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ మురలీధర, రాష్ట్ర అధ్యక్షులు పొట్ల మాధవరావు, రిసెప్షన్ కమిటీ చైర్మన్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్ధన్, ఐఏఎల్ నాయకులు, న్యాయవాదులు ఏవి.క్రిష్టారావు, బొమ్మగాని శ్రీనివాస్, ఉదయ్ భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి బీమనాథ్ శ్రీనివాస్, ఐయిప్సో జాతీయ కార్యదర్శి కేవీఎల్, హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రమేష్ బాబు, జీవన్ గౌడ్, ఐఏఎల్ నాయకులు ఎం.ఆది రెడ్డి, జయ శ్రీనివాస్, ఒరుగంటి శేషగిరిరావు, మాధవరావు, లతీఫ్, రాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాసభలలో ఇటీవల ఏబిటీఈ పరీక్షలలో ముందంజలో నిలిచిన ఐదుగురిని జస్టిస్ నగేష్ బీమపాక శాలువాతో సత్కరించి క్రిమినల్ లా పుస్తకాలను అందజేశారు.



## జవాన్‌కు అంతిమ వీడ్కోలు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** కలకత్తా ఆర్మీ బేస్ క్యాంపులో విధులు నిర్వహిస్తున్న డోర్నకల్ పట్టణానికి చెందిన ఆర్మీ జవాన్ కొదిరిపాక సతీశ్ (34) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. ఆయన పార్థీవ దేహాన్ని శనివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. దీంతో పట్టణ వాసులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆర్మీ అధికారులు, పోలీసులు, వివిధ పార్టీ నాయకులు, ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లు, విద్యార్థులు సతీశ్ కు ఘనంగా నివాళులు అర్పించారు. అపుల ఆశ్రునయనాలు, బంతి పూల వర్షం, బరువెక్కిన హృదయాల నడుమ చివరి యాత్ర కొనసాగింది. పుర వీధుల్లో ఆయన భౌతికాయాన్ని చూసేందుకు జనం పోటెత్తారు. ఆర్మి లాంచనాలతో వీడుకోలు పలికి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

## టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశం

### డిసెంబర్ 2న బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశంను నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత చైర్మన్ మహేందర్ రెడ్డి పదవీ కాలం డిసెంబర్ 2తో ముగియనుంది. దీంతో టీజీపీఎస్సీ చైర్మన్ గా బుర్రా వెంకటేశం అదే రోజు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ ప్రాంతానికి చెందిన నిరుపేద కుటుంబంలో జన్మించిన బుర్రా వెంకటేశంకు సిన్సియర్ ఆఫీసర్ గా గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆయన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బీఎస్జీ) చీఫ్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బుర్రా వెంకటేశంను నియమించారు. ఈ క్రమంలోనే ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎఫ్ఏసీ బాధ్యతలు ఇచ్చారు. గతంలో ఆయన కాలేజీ విద్యాశాఖ కమిషనర్ గా, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ గా అడిషనల్ బాధ్యతలతో పాటు తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జి వీసీగా కూడా పని చేశారు. తర్వాత గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు.



## ఫేక్ ఆయుర్వేదిక్ క్లినిక్ లపై చర్యలు తీసుకోండి

### ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, డీఎంహెచ్ఓలకు వినతి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఫేక్ ఆయుర్వేదిక్ క్లినిక్ లపై చర్యలు తీసుకోవాలని నేషనల్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ కోరింది. ఈ మేరకు శనివారం హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రమీల దేవికి ఫేక్ ఆయుర్వేదిక్ క్లినిక్ లపై ఫిర్యాదు చేశారు. వారు ప్రజలలో ఒక రకమైన భయాన్ని కలిగించి అశాస్త్రీయ పద్ధతిలో వైద్య చికిత్సలు నిర్వహిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారని ఆరోపించారు. వ్యాధి ముదిరిన రోగులను ఇతర ఆస్పత్రులకు పంపుతున్నారన్నారు. వీరికి ఎలాంటి రిజిస్ట్రేషన్ లు లేవన్నారు. వేరే రాష్ట్రంలో బీఏఎంఎస్ చదివినా కూడా తెలంగాణలో ఆయుష్ ప్రాక్టీస్ చేయడానికి ఇక్కడి రిజిస్ట్రేషన్ తప్పక ఉండాలని గుర్తు చేశారు. హనుమకొండ కొత్త బస్టాండ్, కుమార్ పల్లి ఏరియాలోని అనుపమ క్లినిక్, మారుతి క్లినిక్, లక్ష్మీ క్లినిక్ ల పేరుతో దందా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. వీరిపై తగు చర్యలు తీసుకోవాలని నేషనల్ మెడికల్ అసోసియేషన్ తరపున అధ్యక్షుడు డాక్టర్ గుండా రవీందర్, జనరల్ సెక్రెటరీ డాక్టర్ మైదం రాజు, డాక్టర్ నవీన్, డాక్టర్ అరుణ్ కుమార్ కోరారు.

## ఇస్రో స్పేస్ ట్యూటర్ గా శశాంక్ భూపతి

### ఎంపికైన యువ ఆర్కిటెక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండకు చెందిన యువ ఆర్కిటెక్ శశాంక్ భూపతి ఇస్రో స్పేస్ ట్యూటర్ గా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక స్పేస్ ట్యూటర్ గా ఆయన గుర్తింపు పొందారు. వరంగల్ జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న భూపతి శంకర్–శ్యామల కుమారుడు శశాంక్ భూపతి. కాగా శశాంక్ భూపతి జేఎన్టీయూ నుంచి 2022 లో ఆర్కిటెక్చర్ కోర్సును పూర్తి చేశారు. ప్రస్తుతం స్పేస్ ఆర్కిటెక్చర్ సబ్జెక్టును తన స్పెషలైజేషన్ గా ఎంచుకొని పలు పరిశోధన చేస్తున్నారు. చిన్నతనం నుంచి అంతరిక్షంపై ఆసక్తి కనబరుస్తూ వచ్చిన శశాంక్ తన ఆర్కిటెక్చర్ విద్యను అంతరిక్షానికి అనుసంధానిస్తూ 2022 సంవత్సరంలో ఏన్షియంట్ టెక్నాలజీస్ డిజైన్ రీసెర్చ్ ల్యాబ్ అను కంపెనీని స్థాపించారు. ఇలాంటి స్పేస్ రీసెర్చ్ ఆర్కిటెక్చర్ కంపెనీలు భారతదేశంలో రెండు ఉండగా ఒకటి ఉత్తర భారత దేశంలో, రెండోది దక్షిణ భారతదేశంలో శశాంక్ భూపతి కంపెనీ కావటం గర్వకారణం. ఇప్పటికే శశాంక్ ప్రాజెక్టులు చూసి నివ్వెరపోయిన దేశంలోని పలు యూనివర్సిటీలు వారు నిర్వహించే స్పేస్ ఆర్కిటెక్చర్ వర్క్ షాపులకు శశాంక్ ను గెస్ట్ లెక్చరర్ గా పిలువగా, అక్కడికి వెళ్లి విద్యార్థులకు స్పేస్ ఆర్కిటెక్చర్ పై అవగాహన సదస్సులు నిర్వహించి అవార్డులు కూడా తీసుకున్నారు.

**స్పేస్ ట్యూటర్ల నియామకం..**

ఈ క్రమంలో మన ప్రధాని నరేంద్ర మోడీ అంతరిక్ష పరిశోధనలకై విద్యార్థులలో అవగాహన పెంపొందించడానికి దేశంలో నైపుణ్యం కలిగిన కొంత మంది స్పేస్ ట్యూటర్లను నియమించే బాధ్యతను ఇస్రోకు అప్పగించగా, శశాంక్ భూపతికి చెందిన కంపెనీ చేపడుతున్న ప్రాజెక్టులు నచ్చిన ఇస్రో శశాంక్ భూపతిని వారి రిజిస్టర్డ్ స్పేస్ ట్యూటర్ గా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేశ మొత్తం నుంచి అతి కొద్ది మందిని ఎంపిక చేయగా, అందులో మన తెలంగాణ రాష్ట్రం నుంచి శశాంక్ భూపతి ఒక్కడే ఇస్రో స్పేస్ ట్యూటర్ గా ఎంపిక కావటం తెలంగాణకే గర్వకారణం.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com